www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 30 అక్టోబర్ 2024
5
పశ్చిమ గోదావరి

ఆరు నెలల గడువు ఇవ్వండి

కలెక్టర్‌కు అయిభీమవరం కాల్వ గట్టువాసుల వినతి

ప్రజాశక్తి - ఆకివీడు

మండలంలో అయిభీమవరం కాలువ గట్టుపై ఇళ్ల తొలగింపు ఆరు నెలల గడువు ఇవ్వాలని, నివాసితులకు కేటాయించిన ఇళ్ల స్థలాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించి, ఇల్లు లేని వారికి ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని మండలంలోని అయి భీమవరం కాలువ గట్టు నివాసితులు కలెక్టర్‌ను కోరారు. వారంతా మంగళవారం భీమవరంలోని జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని నివాసితులు ఆకివీడులో విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో కె.తవిటినాయుడు, బొడ్డుపల్లి రాంబాబు, సందక సూరిబాబు, దోకల రవితేజ, ఎస్.అప్పన్న, ఎస్.శ్రీను, ఎన్.అప్పారావు, సర్కార్, అప్పలకొండ, భవాని, ఎం.కుమారి, లక్ష్మి, వజ్రం పాల్గొన్నారు.

పేలుతున్న టపాసుల ధరలు

ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన దీపావళి టపాసుల దుకాణాలు

ధరల నియంత్రణపై కొరవడిన పర్యవేక్షణ
దుకాణాల వద్ద కానరాని ధరల పట్టిక
ఇష్టానుసారంగా ధరలు నిర్ణయించి అమ్మకాలు
రెండు జిల్లాల్లో 500కుపైగా బాణసంచా దుకాణాలకు లైసెన్సులు
జాగ్రత్తలతోనే సరి.. ధరలపై పట్టించుకోరా అంటూ జనం ఆగ్రహం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో పండగ పూట ఆర్భాటంగా గడపాల్సిన పరిస్థితి ఒకవైపు, మరోవైపు దీపావళి టపాసుల ధరలు పేలుతుండటం సామాన్య ప్రజానీకాన్ని బెంబేలెత్తిస్తున్నాయి. భారీగా పెరిగిన టపాసుల ధరలతో సామాన్యులు దీపావళి పండగంటే భయపడే పరిస్థితి ఏర్పడింది. కుటుంబం అంతా కలిసి జరుపుకోవాల్సిన దీపావళిని డబ్బు ఉన్నవారికే పండుగ అన్నట్లు మారింది. గురువారం దీపావళి పండగ నేపథ్యంలో రెండు జిల్లాల్లోనూ పెద్దఎత్తున మందుగుండు సామగ్రి దుకాణాలు ఏర్పాటయ్యాయి. పశ్చిమగోదావరి జిల్లాలో మంగళవారం మధ్యాహ్నానికి 302 దుకాణాలకు తాత్కాలిక లైసెన్సులు మంజూరు చేశారు. లైసెన్సుల జారీ ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. ఏలూరు జిల్లాలో 200 దుకాణాలకు లైసెన్సులు జారీ చేయగా ఇంకా జారీ ప్రక్రియ కొనసాగుతోంది. బుధవారం మధ్యాహ్నానికి దుకాణాల సంఖ్యపై పూర్తిస్థాయి స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. మందుగుండు సామగ్రి దుకాణాల లైసెన్సుల వ్యవహారం ఫైర్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో సాగుతోంది. పోలీసుశాఖ పర్యవేక్షణ సైతం ఉంటుంది. జిల్లా కేంద్రం ఏలూరులోని ఇండోర్ స్టేడియంలో 47 మందుగుండు సామగ్రి దుకాణాలు ఏర్పాటు చేయగా, పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరం లూథరన్ గ్రౌండ్‌లో 39 దుకాణాలను ఏర్పాటు చేశారు. ఇక మండలాలు, గ్రామాల పరిధిలో పెద్దఎత్తున మందుగుండు సామగ్రి దుకాణాలు ఏర్పాటయ్యాయి. ఈ దుకాణాల వద్ద ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయంపైనే అధికారులు మాట్లాడుతున్నారు. మందుగుండు సామగ్రి ధరల నియంత్రణపై ఎక్కడ అధికారి నోరు మెదపడం లేదు. మందుగుండు సామగ్రి దుకాణాల వద్ద ధరలకు సంబంధించిన పట్టికలు లేకుండా పోయాయి. బస్టాండ్లు, రైతుబజార్లలో సైతం అక్కడ విక్రయించే వస్తువుల ధరల పట్టిక ప్రదర్శిస్తారు. గ్రామ సచివాలయాల వద్ద సైతం ఏ సేవకు ఎంత రుసుము వసూలు చేయాలో సైతం వివరిస్తున్నారు. దీపావళి మందుగుండు సామగ్రి ధరలపై మాత్రం కనీస పర్యవేక్షణ లేకుండా పోయింది. దుకాణం ఏర్పాటు చేసిన వ్యక్తి తనకు నచ్చిన ధర నిర్ణయించి విక్రయించేస్తున్న పరిస్థితి ఉంది. దీపావళికి మందుగుండు సామగ్రి అమ్మకాలు రూ.కోట్లలో జరుగుతుంటాయి. ఈ పరిస్థితుల్లో ధరల నిర్ణయంపై స్పష్టత లేకపోవడం ఏమిటనే ప్రశ్న జనాలను తొలిచేస్తోంది.

ధరలతో జనం బెంబేలు

దీపావళి మందుగుండు సామగ్రి ధరలు చూసి సామాన్యులు వణికిపోతున్నారు. గతంలో రూ.500 తీసుకెళ్తే ఇంటిల్లిపాది కాల్చుకునేంతగా దీపావళి సామాను వచ్చేవి. ఇప్పుడు ఆ డబ్బులకు ఒకటి, రెండు వస్తువులు కూడా రాని పరిస్థితి ఉంది. టపాసుల ధరలు గతంతో పోల్చితే భారీగా పెంచేసి అమ్ముతున్నారు. నలుగురు సభ్యులున్న కుటుంబం కనీసం రూ.ఐదు వేలు ఖర్చుచేస్తే తప్ప కొద్ది మందుగుండు సామగ్రి వచ్చే పరిస్థితులు లేవు. దీంతో సామాన్య ప్రజానీకం దీపావళి పండుగ జరుపుకోలేని పరిస్థితి నెలకొంది. అధికారులు మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా హడావుడి చేస్తున్నారనే విమర్శలున్నాయి. జీఎస్‌టి అధికారులు చూసుకుంటారని చెబుతున్నారు. విక్రయించే ప్రతి వస్తువుకూ జీఎస్‌టి ఉంటుంది. ధరల పట్టిక లేకుండా ఏవిధంగా విక్రయాలు సాగిస్తారో అర్థం కావడం లేదు. సంబంధిత శాఖల అధికారులకు పెద్దఎత్తున మామూళ్లు ఇస్తున్నామని, ధరలు తగ్గించి విక్రయిస్తే తమకు ఏమాత్రం గిట్టుబాటు కాదన్నట్లు దుకాణ యజమానులు చెబుతుండటం విశేషం.

ఫైర్ అధికారుల స్పందన కరువు

దీపావళి మందుగుండు సామగ్రి దుకాణాల ఏర్పాటులో ఫైర్ అధికారులది కీలకపాత్ర. ఆ శాఖ అధికారులు ఇన్‌స్పెక్షన్ చేసి ఇచ్చే నివేదిక ఆధారంగానే రెవెన్యూ అధికారులు దుకాణాలకు లైసెన్సులు మంజూరు చేస్తారు. అయితే ఈ దుకాణాల ఏర్పాటుకు సంబంధించి ఎటువంటి వివరాలను ఫైర్ అధికారులు చెప్పడం లేదు. దీనిపై మీడియా ముఖంగానూ అధికారులు స్పందించకపోవడం, ఫోన్లకు స్పందించకపోవడం గమనార్హం. మందుగుండు సామగ్రి దుకాణాల ఏర్పాటులో ఏమైనా ఇబ్బందులుంటే సరిచేయాల్సిన అధికారులే స్పందించకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఏలూరు ఫైర్ ఆఫీసులో దుకాణాల ఏర్పాటుకు సంబంధించి కనీస సమాచారం ఇవ్వకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. ఇప్పటికైనా ఫైర్ అధికారులు మందుగుండు సామగ్రి దుకాణాలకు సంబంధించిన సమాచారం, ధరలకు సంబంధించిన వివరాలను ప్రజలకు తెలిపే విధంగా చర్యలు తీసుకుంటే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మచ్చుకు కొన్నింటి ధరలు..

పేరు	ధర
కాకర పువ్వొత్తుల బాక్స్	రూ.100
చిచ్చుబుడ్లు చిన్నవి బాక్స్	రూ.160
భూచక్రాలు బాక్స్	రూ.150
60 షాట్స్ బాక్స్	రూ.900
పాముబిళ్లల బాక్స్	రూ.50
లక్ష్మీబాంబ్ కట్ట	రూ.150
నారబాంబు బాక్స్	రూ.150
విష్ణు చక్రాలు బాక్స్	రూ.150

నైపుణ్య గణన పారదర్శకంగా నిర్వహించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

జిల్లా అభివృద్ధిలో నైపుణ్య గణన ప్రముఖ పాత్ర పోషిస్తుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో ఎపి నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్య గణన-2024 జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సచివాలయ సిబ్బందికి పిపిటి ప్రజెంటేషన్ ద్వారా వారు చేయాల్సిన విధులు, నైపుణ్యం యాప్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లోనే యువత ఎక్కువగా ఉన్న దేశం మనదన్నారు. వీరందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకపోతే సమస్యాత్మకంగా మారే అవకాశం ఉందన్నారు. ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా తలసరి ఆదాయం పెరగడంతోపాటు దేశం ఆర్థికంగా బలోపేతమవుతుందన్నారు. నైపుణ్యం అనేది మనం నేర్చుకునే విద్యలో ఒక భాగం అని, దానిని ప్రత్యేకంగా విభజించి చూడాల్సిన అవసరం లేదని అన్నారు. ఉపాధి అవకాశాలను వెతుక్కుంటూ ఎంతోమంది తల్లులు చిన్నతనంలోనే తమ పిల్లలను వదిలి దేశం వదిలి వెళ్తున్నారని, మన దేశంలోనే ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి గణన ద్వారా వాటిని సరైన మార్గంలో అవసరమైన వారికి వినియోగించడానికి ఉపయోగపడుతుందన్నారు. ఆటోమేషన్, కృత్రిమమేధ, ఆర్థిక వ్యవస్థ కీలకపాత్ర పోషించనున్నాయని, వీటి వల్ల కొత్త అవకాశాలతోపాటు కొత్త సవాళ్లను ఎదుర్కోవాల్సిన పరిస్థితులు రానున్నాయన్నారు. సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. భవిష్యత్తులో వచ్చే మార్పులకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ఉద్యోగాలు పొందడానికి సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నైపుణ్య గణనను సచివాలయ సిబ్బంది పారదర్శకంగా నిర్వహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ విభాగం ద్వారా జిల్లాలోని స్కిల్ ల్యాండ్ స్కేప్ మెరుగుపర్చడానికి విద్య, ఉపాధి అవకాశాలు మధ్య గల అంతరాన్ని పూరించడానికి సమగ్ర స్కిల్ సెన్సెస్ నిర్వహిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రతి ఇంటినీ క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి ఇంటిలో ఉన్న వారి పూర్తి వివరాలను పారదర్శకంగా నైపుణ్య మ్యాప్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్-ఎస్.వేణుగోపాల్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకమాన్, జిల్లా ఉపాధి అధికారి వరలక్ష్మి, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, ఎపిఎస్ఎస్‌డిసి జిల్లా కోఆర్డినేటర్ ఎ.అక్షయ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన విద్యార్థుల బృందం

అంతర్జాతీయ సంగీత నృత్య సమ్మేళనంలో ప్రథమస్థానంలో నిలిచిన భీమవరం విద్యార్థుల బృందం మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ చదలవాడ నాగరాణిని కలిశారు. ఈ నెల 13న అంతర్జాతీయ నృత్య సంగీత సమ్మేళనం తెలంగాణ రాష్ట్రం చిక్కడపల్లి త్యాగరాజ గాన సభలో నిర్వహించారు. ఈ పోటీలలో తొమ్మిది జిల్లాల కళాకారులు పాల్గొనగా కూచిపూడి నృత్యవిభాగంలో భీమవరానికి చెందిన కడలి భానుశ్రీ మాస్టారు ద్వారా శిక్షణ పొందిన బృందం మూడు విన్యాసాల్లో మూడు ప్రథమ బహుమతులను గెలుచుకుంది. భానుశ్రీ జాతీయ స్థాయిలో కళాకారిణిగా రాణించడంతోపాటు పలువురికి శిక్షణ అందిస్తున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు వివిధ అంశాల్లో కూడా ప్రవేశం, ప్రావీణ్యం సంపాదించి మెరుగ్గా రాణించాలన్నారు. తొమ్మిది జిల్లాల కళాకారులు పోటీ పడిన సందర్భంలో మన భీమవరం వాసులు ప్రథమ బహుమతులను గెలుచుకోవడం సంతోషదాయకమన్నారు. వారి బృందానికి, నాట్యం నేర్పిస్తున్న టీచర్‌ను అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో పోటీలకు హాజరయ్యేలా ప్రోత్సహించిన శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయిని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంలో కడలి భానుశ్రీ మాస్టారును జిల్లా కలెక్టర్ శాలువా కప్పి అభినందించారు.

చదువులమ్మ ముద్దుబిడ్డ భారతి

ఉపాధ్యాయిని వేగేశ్న భారతి ఉద్యోగ విరమణ సభలో పలువురు వక్తలు
పాఠశాలలానే గ్రామాన్ని అభివృద్ధి చేయాలి
భారతి తండ్రి నరసింహారాజు
ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ప్రతినబూనాలి
పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపీమూర్తి
నా మొదటి గురువు తాత మార్రాజు
ఉపాధ్యాయిని భారతి

ప్రజాశక్తి - పాలకోడేరు

ఉపాధ్యాయిని భారతి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

విద్యా బోధనే కాకుండా పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నతికి నిరంతరం శ్రమించి, సమాజ అభివృద్ధికి సేవలందిస్తున్న ఉపాధ్యాయిని వేగేశ్న భారతి భరతమాత ముద్దుబిడ్డ అని పలువురు వక్తలు అన్నారు. పాలకోడేరు ఉపాధ్యాయిని వేగేశ్న భారతి ఉద్యోగ విరమణ సత్కార సభ స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులు సమక్షంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. భారతి స్వగృహం నుంచి పాఠశాల బ్యాండ్, మార్చ్‌ఫాస్ట్ చేస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులు భారతి దంపతులను పాఠశాల సభా వేదిక వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.మహేష్‌బాబు అధ్యక్షత వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ చదువులమ్మ సేవలో భారతి కృషి అభినందనీయమన్నారు. క్రమశిక్షణ, అంకితభావానికి నిదర్శనమన్నారు. ఎంతోమంది విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. పాఠశాల అభివృద్ధిలోనూ కీలక పాత్ర పోషించారన్నారు. సామాజిక స్పృహతో సమాజాభివృద్ధికి తోడ్పాటు అందించడం ఆమె గొప్పతనమన్నారు. ఉద్యోగ విరమణ చేస్తున్నప్పటికీ పాఠశాలకు వచ్చి విద్యా బోధన చేస్తానని చెప్పడం విద్య పట్ల ఆమెకున్న అంకితభావం వర్ణనాతీతమన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. భారతి మనవరాలు యోగ్యత, మోక్షజ్ఞ చేసిన నృత్యం అందర్నీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సర్పంచి ఇంజేటి మరియమ్మ, ఎంఇఒలు పిఎన్‌వి.నాగరాజు, ఎంఎస్.శ్రీమన్నారాయణ, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మన్ చెల్లంకి మస్తాన్‌రావు, వైస్ ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి, భారతి తండ్రి వేగేశ్న నరసింహారాజు, తల్లి లక్ష్మీభాయి, పెదమామ, రిటైర్డ్ హెచ్‌ఎం పెన్మెత్స దయానందరాజు, కుమారుడు గొట్టుముక్కల రాజేష్, కోడలు రమాదేవి, కుమార్తె నడింపల్లి గాయత్రి, అల్లుడు జగదీష్, మనవళ్లు కేదార్ వర్మ, మహంత్ వర్మ, మనవరాళ్లు మోక్షజ్ఞ, యోగ్యత, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, కోశాధికారి పట్టాభిరామయ్య, మండలాధ్యక్షులు వెంకటరమణరాజు, ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు సాయివర్మ, రిటైర్డ్ హెచ్‌ఎం కె.రామకృష్ణ, రిటైర్డ్ ఉపాధ్యాయులు గొట్టుముక్కల రామలింగరాజు (పాలకోడేరు మాస్టారు), పెన్షనర్స్ అసోసియేషన్ భీమవరం కార్యదర్శి పి.సీతారామరాజు, నీటితిప్ప హైస్కూల్ హెచ్‌ఎం రవివర్మ, రిటైర్డ్ ఎంఇఒ కనకరాజు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు.

భారతి దంపతులను ఊరేగింపుగా తీసుకొస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పాలకోడేరును అభివృద్ధి చేయాలి

భారతి తండ్రి వేగేశ్న నరసింహారాజు

పాలకోడేరు వస్తూ గ్రామాన్ని చూశాను. పాఠశాలను అభివృద్ధి చేసినట్టే గ్రామాన్ని కూడా అభివృద్ధి చేయాలి. దీనికి నా వంతు సహకారం అందిస్తాను. నేను చదువు పూర్తయిన తర్వాత ఏ ఉద్యోగంలో చేరాలని ఆలోచించాను. అప్పట్లో ఏ దిక్కూ లేనివాడు ఉపాధ్యాయుడు అనేవారు. నేను మాత్రం ఉపాధ్యాయుడిని కావాలని అయ్యాను. నా పిల్లలను కూడా ఉపాధ్యాయులుగా చేశాను. ఉపాధ్యాయుని వృత్తిలో అవినీతికి ఆస్కారం ఉండదు. నా ఎదుట నా కుమార్తె భారతిని అభినందిస్తుంటే ఆనందంగా ఉంది.

విద్యారంగ పరిరక్షణకు ప్రతినబూనాలి

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి బి.గోపీమూర్తి

ఉపాధ్యాయిని భారతితో 24 ఏళ్ల నుంచి పరిచయం ఉంది. విద్యారంగ అభివృద్ధికి ఆమె అందించిన సేవలు ఎనలేనివి. విద్యార్థుల ఆర్థిక పరిస్థితులు తెలుసుకుని ఆ విధంగా విద్యాబోధన సాగించడం ఆమె గొప్పతనం. ఆమె యుటిఎఫ్‌లో కీలక పాత్ర పోషించారు. సామాజిక కార్యకర్తగా కరోనా వంటి కష్టకాలంలో ఆమె అందించిన ఆర్థిక తోడ్పాటు అభినందనీయం. గ్రామాల్లో బడి, గుడి ఉన్నప్పటికీ గుడికి ఇచ్చిన ప్రాధాన్యత బడికి ఇవ్వట్లేదు. కార్పొరేట్ కబంధ హస్తాల్లో విద్యారంగం నలిగిపోతుంది. ప్రభుత్వ విద్యారంగం బలంగా ఉన్న దేశాలు అన్ని విధాలా అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయి. మనదేశంలో మాత్రం విద్యారంగంలో కార్పొరేట్లు రాజ్యమేలుతున్నారు. భారతి ఉద్యోగ విరమణ సందర్భంగా విద్యారంగ పరిరక్షణకు ప్రతిఒక్కరూ ప్రతినబూనాలి.

నా మొదటి గురువు తాతయ్య మార్రాజు

ఉపాధ్యాయిని భారతి

నా కుటుంబ సభ్యులంతా ఉపాధ్యాయులే. నేను కూడా ఉపాధ్యాయిని కావడం ఆనందంగా ఉంది. మా నాన్న నరసింహారాజు, పెద్ద మేనమామ దయానందరాజు, చిన మేనమామ సోమరాజు, అన్నయ్య రామరాజు, తమ్ముడు శ్రీనివాసరాజుతోపాటు నాకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు నరసింహమూర్తి, శ్రావణరావు, శ్రీనివాసరావు అటు చదువులోను, ఇటు ఉద్యోగంలోను అందించిన సహకారం మరువలేను. నా మొదటి గురువు మాత్రం మా తాతయ్య పెన్మెత్స మార్రాజు. చింతపర్రు గ్రామ సర్పంచిగా పని చేసి గ్రామాభివృద్ధికి బాటలు వేశారు. అలాగే వైద్యునిగానూ పని చేశారు. మా తాతయ్య ప్రభావం నా మీద పడింది. ఆయన అడుగుజాడల్లో నడిచి ఈరోజు ఈస్థాయికి ఎదిగి మీ అందరి మన్ననలు పొందడం ఎంతో ఆనందంగా ఉంది. నేను పుట్టింది చింతపర్రు గ్రామమైనా నా మెట్టినిల్లు పాలకోడేరు అంటే నాకు ఎంతో ఇష్టం. గ్రామాన్ని అన్నివిధాలా రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేయాలనేది నా ఆకాంక్ష. దీనికి అందరూ సహకారం అందించాలి.

భారతిని చూస్తుంటే ఎంతో గర్వంగా ఉంది

ఆమె గురువులు నరసింహమూర్తి, శ్రావణరావు

భారతి అందించిన సేవలను ఇంతమంది అభినందిస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది. విద్యార్థి ఉన్నత స్థితిలో ఉంటే అది పాఠాలు బోధించిన ఉపాధ్యాయులకు ఎంతో గౌరవం. భారతిని చూస్తుంటే మాకు ఎంతో గర్వంగా ఉంది. పాఠాలు చెబుతూనే అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయం. సోషల్ టీచరుగా పనిచేయడం, విద్యార్థులను మెప్పించడం ఇంకా కష్టం. భారతి మాత్రం అటు విద్యలోనూ, ఇటు కుటుంబ విషయంలోనూ ఎంతో సక్సెస్ అయ్యింది.

పెంచిన విద్యుత్ ఛార్జీలు ఉపసంహరించుకోవాలి

ప్రజాశక్తి - తణుకు

ప్రతులను దహనం చేస్తున్న సిపిఎం నేతలు

ట్రూఅప్ విద్యుత్ ఛార్జీల పేరుతో ప్రజలపై వేసిన రూ.6072 కోట్ల భారాన్ని కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక వై జంక్షన్‌లోని విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతులను సిపిఎం ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన నాలుగు నెలలకే రూ.6072 కోట్లు మేర విద్యుత్ భారాలు మోపడం బాధాకరమన్నారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు పెరిగి జనం నానావస్థలు పడుతున్నారన్నారు. పెంచిన ఛార్జీలు ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో గార రంగారావు, చిన్న, సూర్యారావు, కృష్ణ, రాంబాబు, శివ, అనిల్, అప్పన్న, రాము, అచ్యుత్, నర్సింహామూర్తి, రమేష్, సురేష్, సాయి, శ్రీను, శివసాయి, పెంటయ్య, రమణ, లక్ష్మణ్, బాలాజీ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కూటమి ధ్యేయం

ఎంఎల్‌ఎ బొలిశెట్టిచే ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, ఆ దిశగానే ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ ఉంటుందని ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. తాడేపల్లిగూడెం మండలం పెద తాడేపల్లిలో జిల్లాలో తొలి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. రవాణా దగ్గర నుంచి కూలీల వరకు అంతా ప్రభుత్వమే చెల్లిస్తుందని వివరించారు. మిల్లర్లు కూడా రైతులను ఎలాంటి ఇబ్బందీ పెట్టకుండా వారు తెచ్చిన ధాన్యాన్ని సేకరించాలన్నారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతులకు సొమ్ము జమవుతుందన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి ఇబ్బంది తలెత్తినా రైతులకు తాను అండగా ఉంటానని, ఏ సమయంలోనైనా తనకు రైతులు ఫోన్ చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద తాడేపల్లి సర్పంచి పోతుల అన్నవరం, టిడిపి మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్, జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్, ఆర్‌డిఒ కతీఫ్ కౌసర్ భనో, తహశీల్దార్ ఎం.సునీల్‌కుమార్, ఎంపిటిసిలు గోవింద్, సత్యనారాయణ, అధికారులు, నేతలు పాల్గొన్నారు.

ట్రూఅప్ ఛార్జీల పేరుతో భారాలు వేయొద్దు

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మాట్లాడుతున్న బలరాం

ఇంధన సర్దుబాటు, ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలు మోపొద్దని, విద్యుత్ భారాలను రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కమిటీ సభ్యుల సమీక్షా సమావేశం మంగళవారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో కరెడ్ల రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ జిల్లా కార్యదర్శి బి.బలరాం, సెక్రటేరియట్ సభ్యులు సిహెచ్.బాబూరావు, జెఎన్‌వి.గోపాలన్, కర్రి నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు కరెంట్ ఛార్జీలు పెంచబోమని, ట్రూఅఫ్ ఛార్జీలు రద్దు చేస్తామని చంద్రబాబు చెప్పి హామీకి భిన్నంగా ట్రూఅఫ్ ఛార్జీలు రూ.6 వేల కోట్లు, సర్దుబాటు ఛార్జీలు రూ.14 వేల కోట్లు మొత్తం రూ.20 వేల కోట్ల భారాన్ని ప్రజలపై వేయడం దారుణమని తెలిపారు. విద్యుత్ భారాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశ పెడతామని టిడిపి కూటమి ఆర్భాటంగా ప్రకటించి గతం కంటే రేట్లు తగ్గించాల్సింది పోయి విపరీతంగా పెంచారన్నారు. ఇసుక సరఫరా లేక భవన నిర్మాణ కార్మికులకు, నిర్మాణ దారులకు, ఇసుక బంటా కార్మికులకు, రవాణా కార్మికులకు పూర్తిగా పనిలేదని ప్రభుత్వాన్ని విమర్శించారు. ఉచిత ఇసుక అందుబాటులోకి తేవాలన్నారు. ఒకవైపు బెల్టు షాపులు ఉండవని చెప్పి గ్రామ గ్రామాన బెల్టుషాపులు దర్శనమిచ్చేలా విచ్చలవిడి చేశారని విమర్శించారు. మద్యాన్ని నియంత్రించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలు వేయడాన్ని ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో ఆందోళనలు చేపట్టి ప్రభుత్వాలకు తగు బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డి.వెంకటరావు, జవ్వాది శ్రీను, శిద్దిరెడ్డి శేషుబాబు, వర్రి అప్పారావు, మడకా రాజు, గొల్లు లక్ష్మి పాల్గొన్నారు.

వెంప, దెయ్యాలతిప్ప రోడ్లు వేయాలి

సిపిఎం ఆధ్వర్యాన ప్రదర్శన, ధర్నా

ప్రజాశక్తి - భీమవరం టౌన్

వెంప, దెయ్యాలతిప్ప ఆర్‌అండ్‌బి రోడ్లను వెంటనే వేయాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ సిపిఎం ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వెంప, దెయ్యాలతిప్ప రోడ్ల మీదుగా ప్రతిరోజూ వేలాది మంది విద్యార్థులు, యువత, రైతులు, కార్మికులు, ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. రోడ్లన్నీ గుంతలతో నిండటంతో రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడిందని, వాహనాలు దెబ్బతినడం, అనారోగ్యం పాలవ్వడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లు వేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. అనంతరం తహశీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బొడ్డు లక్ష్మీపతి, తిరుమాని నాగేశ్వరరావు, తోటే శుభకరరావు, పొన్నమండ నాగేశ్వరరావు, ఈద భూషణం, నేతల కృపాదానం, భూపతి తిమోతి, భూపతి శామేలు తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

జెఎన్‌టియుకె బాస్కెట్ బాల్ పోటీల్లో

స్వర్ణాంధ్ర విద్యార్థుల హవా

ప్రజాశక్తి - నరసాపురం

భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 26, 27 తేదీల్లో జరిగిన జెఎన్‌టియుకె సెంట్రల్ జోన్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్ పురుషుల విభాగంలో స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు ప్రథమస్థానం సాధించారని కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కాలేజీ ఫైనల్ ఇయర్ విద్యార్థి కె.కుమార్ రవితేజ రెడ్డి జెఎన్‌టియుకె బాస్కెట్ బాల్ జట్టుకు ఎంపికయ్యాడు. అతని సారధ్యంలో నవంబరు 1 నుండి 5వ తేదీ వరకూ క్రైస్ట్ యూనివర్సిటీ, బెంగళూరులో జరిగే సౌత్ జోన్ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆయా విద్యార్థులను కళాశాల ట్రెజరర్ కెవి.స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపల్ ఎస్.సురేష్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ ఎ.గోపీచంద్, ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ డా.పి.పండరీనాథ్ అన్నీ విభాగాధిపతులు తదితరులు అభినందించారు.

దళితపేటలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఆచంట: దళితపేటలో ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులతో మౌలిక సదుపాయాలు కల్పించాలని మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షులు సరేళ్ల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కందరవల్లిలో మాల మహానాడు కార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా దళిత పేటలో అభివృద్ధి శూన్యమన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేసి దళితపేటలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. మండల యూత్ ఉపాధ్యక్షులుగా రావి పెద్దవెంకటేశ్వర రావు, కందరవల్లి గ్రామ అధ్యక్షులుగా పంతగాని ప్రసాద్, గ్రామ ఉపాధ్యక్షులుగా కుక్కల వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మాల మహానాడు మండల అధ్యక్షులు రావి నాగరాజు, చిల్లే సురేష్, ఎ.పుల్లరావు, ధర్మారావు, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చేతి వృత్తిదారులను ఆదుకోవాలి

భీమవరం టౌన్: చేతివృత్తిదారులకు ప్రభుత్వం అండగా నిలిచి వారి అభ్యున్నతికి సహకారం అందించాలని జిల్లా రిజిస్ట్రార్ లంక వెంకటేశ్వరరావు ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఆయుర్వేద వైద్య మూలపురుషులు శ్రీ ధన్వంతరి స్వామి జయంతి ఉత్సవాలు పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం, మంగళ వాయిద్య కళాకారుల సంఘం, నాయీ బ్రాహ్మణ ఉద్యోగ సాంస్కృతిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మెంటేవారి తోటలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ ఆధ్యాత్మిక ప్రవచనకర్త పిప్పళ్ల ప్రసాదరావు ధన్వంతరి స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడారు. అనతరం గ్రామీణ వైద్యులు గోరంట్ల మహేష్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు నాయీ బ్రాహ్మణ సేవా సంఘం పట్టణ అధ్యక్షులు రఘుబాబు, మంగళ వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షులు మావుళ్ల పాల్గొన్నారు.

కార్యకర్తల సంక్షేమమే ధ్యేయం

మొగల్తూరు: కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా టిడిపి ఎప్పుడూ పనిచేస్తోందని మాజీ ఎంఎల్ఎ బందారు మాధవ నాయుడు అన్నారు. మొగల్తూరులోని లాకు ప్రాంతంలో మంగళవారం సాయంత్రం పార్టీ గ్రామ అధ్యక్షుడు బి.ఏడుకొండలు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ సభ్యత్వంతో రూ.ఐదు లక్షల బీమా సౌకర్యం, రూ.2 లక్షల ప్రమాద బీమా సౌకర్యం అందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ సభ్యత్వాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమాల్లో నాయకులు కుమ్మరపురుగు తాతాజీ, ఇనుకొండ కాశీ, కునపురెడ్డి గోవిందరాజు, కొల్లాటి హరి కవురు రంగా, సత్యనారాయణ పాల్గొన్నారు.

బ్రాహ్మణచెరువులో సమస్యలు పరిష్కరించాలి

పెనుమంట్ర: మండలంలోని బ్రాహ్మణచెరువు చింతపల్లి లక్ష్మీకుమారి ఇంటి వద్ద సిపిఎం మండల శాఖ మహాసభ స్థానిక నేత కోడి ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. మహాసభకు జిల్లా నాయకులు ఆకుల హరేరామ్, మండల నాయకులు కూసం సుబ్బరాజు హాజరయ్యారు. స్థానిక సమస్యలతో పాటు బ్రాహ్మణ చెరువు కాలనీలోని రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి సమస్యలను గుర్తించి నట్లు వారు తెలిపారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరుతున్నట్లు వారు తెలిపారు. సభలో శాఖ కార్యదర్శిగా చింతపల్లి లక్ష్మీకుమారిని ఏకగ్రీవంగా ఎనుకున్నారు.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

తాడేపల్లిగూడెం: దేశవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నాలెడ్జ్ అసెస్మెంట్ పరీక్షల్లో చినతాడేపల్లి శ్రీచైతన్య విద్యార్థులు గణితంలో 14 మంది, భౌతిక శాస్త్రంలో 17 మంది, రసాయన శాస్త్రంలో 16 మంది, మొత్తం 47 మంది రెండో దశకు అర్హత సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసరి ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు దశల్లో జరిగే ఈ పరీక్షల్లో సుమారు 52 శాతం మంది విద్యార్థులు రెండో దశకు అర్హత సాధించడం ఆనందదాయకమన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎజిఎం పార్థసారథి, జోన్ కోఆర్డినేటర్ రామారావు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డీన్, నాగార్జున, సిబ్యాచ్ ఇన్‌ఛార్జి సత్యనారాయణ పాల్గొన్నారు.

రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

భూ హక్కుదారుడు రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. కొత్తపాలెంలో మంగళవారం రీసర్వే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సర్వేలో వచ్చిన వినతుల పరిష్కారానికి అధికారులతో చర్చించి తగు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సర్పంచి లోకం నాగలక్ష్మి వెంకటేశ్వరరావు, నాయకులు కొల్లాటి గోపీకృష్ణ, వలవల నాని, తారక రామారావు పాల్గొన్నారు.

ఉండి : గత ప్రభుత్వంలో రీసర్వే మొత్తం తప్పులతడకగా జరిగిందని, పూర్తి విచారణ చేపట్టి రైతులకు న్యాయం చేయాలని యండగండి వినియోగదారుల సంఘం కార్యదర్శి పివిఎస్ గోపాలకృష్ణంరాజు తెలిపారు. మంగళవారం యండగండి గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో గోపాలకృష్ణంరాజు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో జరిగిన రీసర్వేపై పూర్తి విచారణ చేపట్టాలన్నారు.కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కిలారి తవిటి నాయుడు, తహశీల్దార్ కె.నాగార్జున పాల్గొన్నారు.

సెమిస్టర్‌లో ఛాంబర్స్ విద్యార్థుల హవా

ప్రజాశక్తి - పాలకొల్లు

ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం విడుదల చేసిన రెండో సెమిస్టర్ ఫలితాల్లో ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు 82 శాతం ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. 9.0 నుంచి 9.9 మధ్యలో గ్రేడ్ పాయింట్స్ సాధించిన విద్యార్థులు 92 మంది అని తెలిపారు. కళాశాలలో అత్యుత్తమ బోధన, ప్రమాణాలు కొనసాగిస్తూ ఆధునిక సాంకేతిక విధానాలలో విద్యార్థులను తీర్చుదిద్దడంలో కళాశాల ముందంజలో ఉందని ఛైర్మన్ కెవిఆర్ నరసింహారావు తెలిపారు. ఉత్తమ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ అండ్ సెక్రటరీ కె.రామరాజు, అకాడమిక్ అడ్వైజర్స్ ఎబిఎన్.మూర్తి, నందుల సీతారామరావు, తదితరులు అభినందించారు.

ఆచంటలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఆచంట: ఈ సార్వా పంటను రైతులు తమకు నచ్చిన మిల్లర్లకు ధాన్యాన్ని అమ్ముకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు అన్నారు. మండలంలోని మృత్యుంజయ కో-ఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జెడ్‌పిటిసి సురేష్‌బాబు మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.సోమేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి బి.నాగరాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అధునాతన అంశాలపై అవగాహన పెంచుకోవాలి

గణపవరం: విద్యార్థులు ఎప్పటికప్పుడు అధునాతన అంశాలపై అవగాహన పెంచుకోవాలని భీమవరం డిఎన్ఆర్ కాలేజీ భౌతికశాస్త్ర అధ్యాపకులు ఎంవిఎస్.ప్రసాద్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం గణపవరం డిగ్రీ కాలేజీలో స్పెక్ట్రో స్కోపి అనే అంశం పై మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, లెక్చరర్లు కెవి.గణేష్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

బాణసంచా దుకాణాలు వెలవెల

అధిక ధరలతో జనం బెంబేలు

ప్రజాశక్తి - నరసాపురం

దీపావళి అంటేనే టపాసుల వెలుగులు.. పిల్లల కేరింతలు.. సరదాలు.. దీపావళికి బాణసంచా విక్రయాలే ప్రధాన ఆకర్షణ. అయితే నేడు బాణసంచా దుకాణాలు వెలవెలబోతున్నాయి. ఒక్కో నియోజకవర్గం నుంచి 25 నుంచి 30 వరకూ లైసెన్స్ షాపులు ఏర్పాటు చేశారు. నిత్యావసర సరుకుల ధరలు, డీజిల్, పెట్రోల్ ధరలు పెరగడంతో అన్ని రంగాలపై ఆ ప్రభావం చూపుతోంది. దీంతో దీపావళి అంటేనే హడలిపోయే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇసుక లేక నిర్మాణ రంగం అస్తవ్యస్తమైంది. కార్మికులకు ఉపాధి లేకపోవడంతో ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఉండడంతో ఈ ఏడాది పండుగ సందడి లేదని వ్యాపారులు అంటున్నారు. ఏటా దీపావళికి చాలా రోజుల ముందు నుంచీ సందడి ఉండేది. ఈ ఏడాది కొనుగోళ్లు అంతంత మాత్రంగానే ఉన్నాయని వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. బాణసంచా కొనుగోలుకు దుకాణాలకు వెళ్లిన పేద, మధ్య తరగతి ప్రజలు పెరిగిన ధరలను చూసి నివ్వెరపోతున్నారు. దీంతో అందరూ ఆనందంగా జరుపుకునే దీపావళి పండుగ ధనవంతుల పండుగగా మారిపోయింది. విక్రయానికి కొద్దిరోజులు ముందుగానే తెప్పించి పెట్టుకున్న బాణసంచాను వ్యాపారులు గొడౌన్లకే పరిమితం చేయడంతో తీవ్రంగా నష్టపోయారు. దీపావళి దగ్గర పడడంతో పిల్లలను బుజ్జగించలేక తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారు. దీపావళి బాణసంచా వ్యాపారంలో సైతం రాజకీయ నాయకులు జోక్యం పెరగడంతో వ్యాపారులు లబోదిబోమంటున్నారు. అనుమతుల పేరుతో అధికారులు వేధిస్తూ ఇబ్బందులు గురి చేస్తున్నారని కొందరు వ్యాపారులు ఆరోపిస్తున్నారు. మొత్తంగా ఈ ఏడాది కొనుగోళ్లు తగ్గాయని వ్యాపారులు అంటున్నారు. ధరలు చూసి జనం బెంబేలెత్తిపోతున్నారు.

నరసాపురంలో వెలవెలబోతున్న దుకాణం

ఆకివీడు : దీపావళి బాణసంచా దుకాణాలు వెలవెలబోతున్నాయి. స్థానిక సిఎం హైస్కూల్ ప్రాంగణంలో వ్యాపారులు బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. రిటైల్ లైసెన్సులతో 22 మంది పట్టణంలో దుకాణాల ఏర్పాటు చేశారు. అయితే కొనుగోలుదారులు లేక దుకాణాలు వెలవెలబోతున్నాయి. మందుగుండు సామగ్రి ధరలు చూసి జనం బెంబేలెత్తిపోతున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది కొనుగోళ్లు తక్కువగా ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

36 మందికి లైసెన్సులు

అగ్నిమాపక శాఖ అధికారి వై.నాగేశ్వరరావు

ఆకివీడు, కాళ్ల మండలాల్లో 36 మంది బాణసంచా దుకాణాల ఏర్పాటుకు తాత్కాలిక లైసెన్సులు తీసుకున్నారు. వాటిలో ఆకివీడులో 22, సిద్ధాపురంలో ఒకటి, కాళింగగూడెంలో ఒకటి, కాళ్లలో నాలుగు, కాళ్లకూరులో ఒకటి, జువ్వలపాలెంలో 1, ఏలూరుపాడులో 5 దుకాణాలకు అనుమతులు తీసుకున్నారు.

దుకాణంలో అనధికారిక విద్యుత్ వాడకం?

పెనుమంట్ర : మండల మార్టేరు శివారు వెలగలేరు వద్ద ఉన్న దీపావళి బాణసంచా హోల్‌సేల్ దుకాణం అనధికారికంగా విద్యుత్ వినియోగించుకుంటున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. దుకాణానికి ఎదురుగా ఉన్న మరో షెడ్డు నుంచి విద్యుత్ వినియోగిస్తున్నట్టు వారు పేర్కొన్నారు. అలాగే రహదారికి ఇరువైపులా భారీ ప్రచార బోర్డులు ఏర్పాటు చేశారు. తాడేపల్లిగూడెం రాష్ట్ర రహదారికి ఆనుకొని ఉన్న ఈ దుకాణం ఉండడం, ప్రచార బోర్డుల కారణంగా ఎదురుగా వచ్చే ఇతర వాహనాలు కనిపించని పరిస్థితి. దీంతో ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారింది. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి - వీరవాసరం

కొణితివాడ పిహెచ్‌సి డాక్టర్ యు.నవనీత్

ఇంటర్వ్యూ

దీపావళి వయసుతో సంబంధం లేకుండా పిల్లలు, పెద్దలు ఎంతో ఇష్టంగా చేసుకునే పండుగ. అందరి ఇళ్లల్లో వెలుగును నింపే ఈ పండుగ. ఆ రోజున బాణసంచా కాల్చేటప్పుడు తప్పక జాగ్రతలు తీసుకోవాలని కొణితివాడ పిహెచ్‌సి డాక్టర్ యు.నవనీత్ సూచించారు. మంగళవారం ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

చిన్న పిల్లలు టపాసులు కాల్చే సమయంలో తప్పనిసరిగా పెద్దవారి పర్యవేక్షణ ఉండాలి.

- కాటన్ దుస్తులు ధరించాలి.
- ఊపిరితిత్తుల సమస్యలు ఉన్న వారు తప్పక మాస్కులు ధరించాలి.
- పిల్లలు వారి కళ్లకు ఫేష్‌షీల్డ్ ధరిస్తే మంచిది.
- పొరపాటున నిప్పుకణికలు తగలి గాయమైతే చల్లటి నీటితో, సబ్బుతో కడగాలి. వెంటనే వ్యాసలిన్ గాయంపై పూయాలి, తరువాత ఆసుపత్రికి తీసుకెళ్లాలి.
- దీపవళి రోజున రోడ్లపై వెళ్లేటప్పుడు జాగ్రత్తగా చూసుకుంటూ వెళ్లాలి.
- కోవిడ్ తరువాత ప్రతి ఇంట్లో శానిటైజర్లు ఉంటున్నాయి. దీనికి మండే గుణం ఉండడం వల్ల ఎట్టి పరిస్థితుల్లో శానిటైజర్ చేతులకు రాసుకుని టపాసులు కాల్చకూడదు.
- టపాసులు కాల్చే ముందు ఒక బకెట్ నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలి.
- ఇంటి ముందు టపాసులు కాల్చే సమయంలో పిల్లలను గమనిస్తూ ఉండాలి.
- టపాసులు కాల్చేవారు కాటన్ దుస్తులు ధరిస్తే మంచిది. చూడీదర్‌లు ధరించే వారు వదులుగా ఉండేవి కాకుండా బిగుతుగా ఉండేవి ధరిస్తే మంచిది.
- తారా జువ్వలు, రాకెట్ బాంబులు కాల్చే సమయంలో ఇంటి తలుపులు, కిటికీలు పూర్తిగా మూసివేయాలి. లేని పక్షంలో అవి ఇంటి లోపలికి దూసుకొచ్చే అవకాశం ఉంటుంది.
- ఇంటి లోపల వరండాలో బాంబులు కాల్చకూడదు. వాటి శబ్దం వల్ల వినికిడి సమస్యలతోపాటు శ్వాసకోశ సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

- టపాసులను చేతుల్లో కాల్చకూడదు. పేలని, కాలని టపాసులను వాటి దగ్గరకు వెళ్లి చూడకూడదు. అవి అనూహ్యంగా పేలే అవకాశం ఉంటుంది.
- పర్యావరణానికి అనుకూలంగా ఉంటే గ్రీన్ కాకర్స్ అందుబాటులోకి వచ్చాయి. వాటినే వినియోగించుకుంటే ఉత్తమం.
- బాణసంచా కాల్చే సమయంలో మద్యం సేవించకూడదు. చెప్పులు వేసుకోవాలి.
- టపాసులు కాల్చే సమయంలో శరీరానికి గాయాలైతే వెంటనే చల్లని నీటిని వాడాలి. వెంటనే వైద్యుని సంప్రదించాలి.
- గాలి విపరీతంగా వీచే సమయంలో టపాసులు కాల్చడం మంచిది కాదు. గాల్చి వీచే సమసయంలో టపాసులు కల్చితే నిప్పురవ్వలు ఎగిరి పక్కనే ఉన్న గిడ్డంగులు, తాటాకు ఇళ్లు, గడ్డి వాముపై పడి అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది.

నిర్దేశిత ప్రాంతాల్లోనే బాణసంచా విక్రయించాలి

తహశీల్దార్ ఎం.సోమేశ్వరరావు

ప్రజాశక్తి - ఆచంట

దీపావళి సందర్భంగా అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున నిర్దేశిత ప్రదేశాల్లో మాత్రమే బాణసంచా విక్రయాలు జరపాలని తహశీల్దార్ ఎం.సోమేశ్వరరావు అన్నారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో పంచాయతీ, రెవెన్యూ అగ్నిమాపక, బాణసంచా యజమానులతో సమీక్షించారు. తహశీల్దార్ మాట్లాడుతూ బాణసంచా సామగ్రిని ఇళ్ల మధ్యలో నిల్వ ఉంచితే తక్షణం స్వాధీనం చేసుకుని, యజమానులకు నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. అనుమతులు లేకుండా బాణసంచా తయారీ, విక్రయాలపై చర్యలు తప్పవన్నారు. జన సమూహం ఉన్న ప్రదేశాల్లో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసి విక్రయాలు జరిపితే చర్యలు తీసుకుని ఆయా దుకాణాలను తొలగిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటరమణ, ఆర్ఐ జయలలిత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బ్లాక్ చైన్ టెక్నాలజీ నిపుణుల కొరత ఎక్కువ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

దేశంలో బ్లాక్ చైన్ టెక్నాలజీ నిపుణుల కొరత ఎక్కువగా ఉందని ప్రముఖ ఐడిఎస్ హెడ్ స్ట్రాటజీ పార్ట్నర్ షిప్ ఎడవల్లి సునీల్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మంగళవారం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ భారత్ బ్లాక్ చైన్ నెట్వర్క్ సెంటర్‌ను సీనియర్ ప్రొఫెసర్ కళాశాల డైరెక్టర్ ఎం.జగపతి రాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ సెమినార్ హాల్లో సిఎస్‌ఇ హెడ్ బిహెచ్‌వి ఎస్.రామకృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సునీల్ సుబ్రహ్మణ్యం మాట్లాడారు. రాబోయే రెండేళ్లల్లో ఇందులో నిపుణులకు పెద్ద ఎత్తున అవకాశాలు పెరుగుతాయన్నారు. కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ కెవి.మురళీకృష్ణంరాజు, ఇనోటెక్ ఫౌండర్ అండ్ సిఇఒ మల్లేష్ మాట్లాడారు. కార్యక్రమంలో సిఐసి ప్రోగ్రాం కోఆర్డినేటర్ కెవి.కృష్ణంరాజు, ప్లేస్మెంట్ సెల్ డీన్ కెఆర్.సత్యనారాయణ పాల్గొన్నారు.

తాళ్లకోడు కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

పౌర సంక్షేమ సంఘం డిమాండ్

ప్రజాశక్తి - ఆకివీడు

తాళ్లకోడు ఇళ్ల కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని పౌర సంక్షేమ సంఘం పట్టణ కన్వీనర్ బివి.వర్మ డిమాండ్ చేశారు. తాళ్లకోడులోని 74 ఎకరాల ప్రభుత్వ వెంచర్లో సమస్యలను అధ్యయనం నిమిత్తం సంఘం బృందం మంగళవారం పర్యటించింది. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ గడిచిన 25 సంవత్సరాలుగా ఆకివీడు పట్టణ ప్రజల సుదీర్ఘ పోరాట ఫలితంగా 2007లో అప్పటి ప్రభుత్వం తాళ్లకోడులో 74 ఎకరాలు కొనుగోలు చేసిందన్నారు. మూడు వేల మందికి ఫ్లాట్లు మంజూరు చేశారన్నారు. ఇప్పటివరకూ 900లకు పైగా గృహాలు పూర్తయి నివాసం ఉంటున్నారని, మరో వెయ్యికిపైగా ఇళ్ల నిర్మాణ దశలో ఉన్నాయని చెప్పారు. మూడు వేల కుటుంబాలకుపైగా నివసించే ఈ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనపై ఏ ఒక్కరూ దృష్టి సారించడం లేదని విమర్శించారు. తక్షణం ముంపునీరు బయటకు పంపేలా చర్యలు చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. తాగునీరు లేక నానా అవస్థలు పడుతున్నారని, తక్షణం ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించి తాళ్లకోడు ప్రజల దాహార్తిని తీర్చాలని కోరారు. కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు ఎంఎల్ఎ, కలెక్టర్ ప్రత్యేక నిధులను మంజూరు చేసి ప్రత్యేక అధికారి పర్యవేక్షణలో చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.బీ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గేదెల ధనుష్, పౌర సంక్షేమ సంఘం పట్టణ నాయకులు కె.ప్రసాద్, ఎ.ఏసు, వి.దుర్గారావు, నరసింహస్వామి, పి.సురేష్ పాల్గొన్నారు.

రైతులు సేంద్రియ వ్యవసాయంపై మొగ్గు చూపాలి

ప్రజాశక్తి - ఆచంట

రైతులు లాభసాటి వ్యవసాయం కోసం ఖర్చులు తగ్గించుకుని సేంద్రియ వ్యవసాయంపై మొగ్గు చూపాలని జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు అన్నారు. వల్లూరులో సర్పంచి నేలపూడి బేబీ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి బి.నాగరాజు మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచి గెద్దాడ శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి తాళం శ్రీనివాస్, ఎఇఒ నరేష్ పాల్గొన్నారు.

పెనుమంట్ర: గోస్తనీ నది మురుగు కాలువ పూడిక పనులు చేపట్టాలని ప్రాంత రైతులు కోరారు. మంగళవారం నత్తా రామేశ్వరం గ్రామ సచివాలయం పరిధిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ఎ.జ్యోషిలా మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ పూత దశకు చేరుకుందని, రైతులు అవసరం మేరకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా రైతులు వారి సమస్యలను తెలుపుతూ గోస్తనీ నది మురుగు కాలవ తవ్వకం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచి వెలగల ధర్మారెడ్డి, చంద్రారెడ్డి, గంగిరెడ్డి, భైరవుడు, రైతులు పాల్గొన్నారు.

పరపతి సంఘాలను బలోపేతం చేయాలి

జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో వివిధ రకాల సహకార సంఘాల ఏర్పాటులో అల్పాదాయ వర్గాలకు కూడా ప్రముఖ స్థానం కల్పించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగరాణి అధ్యక్షతన జరిగిన జాయింట్ వర్కింగ్ కమిటీ సమావేశంలో జిల్లాలో సహకార సంఘాల ప్రమోషన్ అవసరమైన భవిష్యత్ కార్యాచరణపై కమిటీ సభ్యులతో సమీక్షించారు. వ్యవసాయ పరపతి సంఘాల బలోపేతం కోసం చేపట్టిన వివిధ కార్యక్రమాలను విస్తృతం చేయాలన్నారు. జిల్లాలో 369 గ్రామ పంచాయతీల్లో 122 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయని, వీటిలో 42 సొసైటీలు బహుళ సేవలందిస్తున్నాయన్నారు. జిల్లాలోని సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు వీధి వ్యాపారులు, ఇతర వెనుకబడిన వర్గాల కోసం సొసైటీల ఏర్పాటు అవసరమని సూచించారు. ఈ సమావేశంలో నాబార్డ్ డిడిఎం టి.అనిల్ కాంత్, సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ హనుమంతరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్‌విఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మరమ్మతుల నిమిత్తం 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ పాతూరు పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.నరసింహమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాలక్ష్మినగర్ జిల్లా పరిషత్ హై స్కూల్, పిఅండ్‌టి కాలనీ ఫీడర్‌లకు సంబంధించి టిటిడి కళ్యాణ మండపం రోడ్డు, మహాలక్ష్మీనగర్, గుణ్ణం ఫంక్షన్ హాల్ రోడ్డు, తాడేపల్లి చెరువు, పాతూరు, మసీద్ రోడ్డు, శేషామహల్ బ్యాక్ సైడ్, డిఎస్ చెరువు, రాకెట్ పార్క్ ఏరియాల లైన్ల మరమ్మతుల నేపథ్యంలో బుధవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కౌన్సిల్‌లో అభివృద్ధిపై చర్చించాలి

ప్రజాశక్తి - నరసాపురం

కౌన్సిల్ సమావేశాల్లో పట్టణ అభివృద్ధిపై చర్చ సాగాలని, అనవసర విషయాలపై సభా సమయాన్ని వృథా చేసుకోవడం వల్ల ఉపయోగం ఉండదని మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు వైకెఎస్ సూచించారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఛైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అధ్యక్షతన జరిగింది. ముందుగా వన్నెంరెడ్డి శ్రీనివాస్ గత సమావేశంలో వాయిదా వేసిన అంశాలను మళ్లీ అజెండాలో ఎందుకు చేర్చారని ప్రశ్నించారు. అత్యవసరంగా జరగాల్సిన పనులపై నిర్లక్ష్యం చూపిస్తున్నారన్నారు. ఇదే సందర్భంలో వీసి కామన నాగిని, అధికార వైఎస్సార్సీపీ సభ్యులు బొంతు రాజశేఖర్, అడిదల శ్యామల, సర్రి కాంతమ్మ అన్నా క్యాంటీన్ ప్రారంభ సమయంలో ఛైర్‌పర్సన్‌కు, కౌన్సిలర్లకు జరిగిన అవమానంపై ఇంకా ఎందుకు చర్యలు తీసుకోలేదని, కౌన్సిలర్లు సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. దీంతో సమావేశం ముందుకు సాగకపోవడంతో వైకెఎస్ ఇలాంటి అల్లర్లవల్ల పట్టణ అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి ఏమైనా ఉపయోగం ఉంటుందా అని ప్రశ్నించారు. కౌన్సిల్ ఆమోదం జరిగిన పనులకు టెండర్లు పిలవడంలేదని, పనులు జరగడంలేదని వైస్ ఛైర్మన్ కొత్తపల్లి నాని అధికారులను ప్రశ్నించారు. కార్తీకమాసం సమీపిస్తున్నా వలంధర రేవు వద్ద యాత్రికుల సౌకర్యార్థం ఏర్పాట్లు చేయడంలేదని ప్రశ్నించారు.

ఆసుపత్రి వ్యవహారంపై ఆర్‌డిఒ విచారణ

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వ్యవహారంపై విచారణ కొనసాగుతోంది. ఇటీవల ప్రజాశక్తి పత్రికలో ప్రసవానికి పైసలువాల్సిందే శీర్షిక ప్రచురించిన విషయం తెలిసిందే. జిల్లా కలెక్టర్ సిహెచ్ నాగరాణి ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం ఏరియా ఆసుపత్రిలో నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు విచారణ చేపట్టారు. ఈ మొత్తం వ్యవహారంపై దర్యాప్తు చేసి రాతపూర్వకంగా అధికారులకు అందజేస్తామని ఆర్‌డిఒ తెలిపారు. కొంతకాలంగా ఆసుపత్రిలో డెలివరీ కేసుల్లో ఉద్యోగి డబ్బులు వసూలు చేసిన వ్యవహారంపై, ఆస్పత్రిలో దీర్ఘకాలంగా పనిచేస్తూ కౌన్సిలింగ్ చేస్తున్న మరో ఉద్యోగి తీరును కూడా ప్రజాశక్తి బయటపెట్టింది. కౌన్సిలింగ్ పేరుతో సదరు ఉద్యోగి గర్భిణులను తన రూము వద్ద గంటలు తరబడి కూర్చోబెట్టడం కూడా విమర్శలకు తావిస్తోంది. ఇదే విషయాన్ని ప్రజాశక్తి ప్రచురించింది. ఈ మొత్తం వ్యవహారంపై ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నామని, దర్యాప్తు అనంతరం జిల్లా అధికారులకు అందిస్తామని ఆర్‌డిఒ తెలిపారు. ఇప్పటికే ఇద్దరు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు అందించారు. ఈ మేరకు వైద్యం పొందుతున్న బాలింతలు, బంధువులు నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆర్.సుప్రియ, ఆర్ఐ లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

డిఎస్‌సి శిక్షణకు ఎక్కువ మంది నమోదు చేసుకోవాలి

నరసాపురం: ఉచిత డిఎస్‌సి శిక్షణకు అభ్యర్థులు తక్కువ సంఖ్యలో నమోదు చేసుకున్నారని, మిగిలిన వారిలో కూడా అవగాహన పెంచి ఎక్కువ మంది అభ్యర్థులు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సహాయ సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిని కె.బాలు సాధన తెలిపారు. వైఎన్ కళాశాల సామాజిక సేవా విభాగం ఆధ్వర్యంలో ఐదు మండలాల సాంఘిక సంక్షేమ సచివాలయ సహాయకులకు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలు సాధన మాట్లాడారు. ఎక్కువ మంది పరీక్షకు హాజరై ఉత్తీర్ణత సాధించేలా చేయాలన్నారు. విద్యార్థుల ఉపకార వేతనాల విషయంలో ఏమైనా ఇబ్బందులుంటే వాటిని వెంటనే సరిచేసి వారికి అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ చింతపల్లి కనకారావు, వైస్ ప్రిన్సిపల్ వెంకటరత్నం, డీన్ శ్రీరామకృష్ణ పాల్గొన్నారు.

ఇద్దరు అరెస్టు

తాడేపల్లిగూడెం: ఏ విధమైన ప్రభుత్వ అనుమతులు లేకుండా దీపావళి మందుగుండు సామగ్రిని అమ్మబోతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సిఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం స్థానిక భీమవరం బైపాస్ రోడ్ లోనో హెూల్ సెల్ ఫ్రూట్స్ మార్కెట్ వీధిలో అనుమతులు లేకుండా దీపావళి సామగ్రి అమ్మడానికి ప్రయత్నిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి సుమారు రూ.1,20,000 విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

నోటీసు

మహారాజశ్రీ సివిల్ జడ్జి వారి కోర్టు (సీనియర్ డివిజన్) : నర్సాపురం

FDP05/2023 in O.S.No.158/2018

Between:
వీరా సత్యవతి ...పిటీషనర్/వాది
Vs
ఓడూరి నాగేశ్వరరావు ...రెస్పాండెంట్స్/ప్రతివాది
To.
ఓడూరి నాగేశ్వరరావు, తండ్రి సూర్యరావు,
ఓడూరి వారి వీధి, మేడపాడు,
యలమంచిలి మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబరు గల పిటిషనులో రెస్పాండెంట్ అయిన మీకు శ్రీకోర్టు వారు అనేక పర్యాయములు నోటీసులు పంపించినప్పటికి తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున, శ్రీకోర్టు వారు ఆదేశముల మేరకు మీ హాజరు కొరకు ఈ పేపరు ప్రకటన ద్వారా మీకు నోటీసులు జారీ చేసియున్నారు. వాయిదా తేది **ది.07-11-2024** తేదీన ఉదయము 10.30 ని॥ గంటలకు మీరు స్వయముగా గాని, వకీలు ద్వారా గాని కోర్టుకు హాజరై మీకు అభ్యంతరములు ఉన్నయెడల తెలియజేసుకొన గలరు. లేనియెడల సదరు విషయముపై మీ పరోక్షమున విచారించి తీర్మానించెదరని ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

శ్రీకోర్టు వారి ఆదేశాలు మేరకు,
పాలకొల్లు **ఎస్.కె.రామలింగేశ్వరరావు**
తేది.29.10.2024 **ఐ.శివసాంబమూర్తి**
అడ్వకేట్స్, పాలకొల్లు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు-కమ్-ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 335/2022

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, దాని బ్రాంచ్ మేనేజర్
-వాది

మరియు

D-1) కాసాని సీతారామయ్య, S/o. పెదముసలయ్య
-ప్రతివాదులు

ప్రతివాదులకు సమన్లు

D-1: కాసాని సీతారామయ్య, S/o. పెదముసలయ్య, డోర్ నెం. 25-14-44/7, శంబునిపేట, పాలకొల్లు, ప॥గో॥జిల్లా, 534260.

వాదికి చెల్లించాల్సిన రుణ మొత్తాన్ని వడ్డీతో సహా వసూలు చేసేందుకు పై దావా మీ పై దాఖలు చేయబడింది. దావా దాఖలు చేసిన తరువాత కోర్టు ద్వారా మరియు రిజిష్టర్ పోస్ట్ ద్వారా మీకు సమన్లు పంపబడ్డాయి, అవి తిరిగివచ్చాయి. అప్పుడు గౌరవనీయ న్యాయస్థానం వాది దాఖలు చేసిన దావా గురించి సమన్లు జారీ చేయబడిందని మీకు తెలియజేయడానికి ఈ పేపర్‌లో ప్రచురించాలని ఆదేశాలు జారీ చేసింది. కాబట్టి మీరు వ్యక్తిగతంగా, లేదా మీ న్యాయవాది ద్వారా **ది. 01-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** కోర్టుకు హాజరై మీపై దాఖలైనా దావాలో మీ వివరణ ఇవ్వవలసి ఉంటుంది. మీరు పైన పేర్కొన విచారణ తేదిలో కోర్టుకు హాజరు కావడంలో విఫలమైతే, పై దావాపై మీకు ఆసక్తిలేదని భావించి, విచారణ జరిపి తీర్పు వెలువరిస్తారు.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 26-10-2024 సెల్: 98662 59514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు-కమ్-ఫస్ట్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 187/2023

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నరసాపురం బ్రాంచ్, దాని చీఫ్ మేనేజర్
-వాది

మరియు

D-1) యండపల్లి రమేష్, మరియు యితరులు
-ప్రతివాదులు

ప్రతివాదులకు సమన్లు

D-1: యండపల్లి రమేష్, S/o. వెంకటేశ్వరరావు, 7వ వార్డు, రాయపాలెం, ఆంధ్రబ్యాంక్ రోడ్డు, నరసాపురం, ప॥గో॥జిల్లా, 534275.

D-2: యండపల్లి శ్రీదేవి, W/o. రమేష్, 7వ వార్డు, రాయపాలెం, ఆంధ్రబ్యాంక్ రోడ్డు, నరసాపురం, ప॥గో॥జిల్లా, 534275.

వాదికి చెల్లించాల్సిన రుణ మొత్తాన్ని వడ్డీతో సహా వసూలు చేసేందుకు పై దావా మీ పై దాఖలు చేయబడింది. దావా దాఖలు చేసిన తరువాత కోర్టు ద్వారా మరియు రిజిష్టర్ పోస్ట్ ద్వారా మీకు సమన్లు పంపబడ్డాయి, అవి తిరిగివచ్చాయి. అప్పుడు గౌరవనీయ న్యాయస్థానం వాది దాఖలు చేసిన దావా గురించి సమన్లు జారీ చేయబడిందని మీకు తెలియజేయడానికి ఈ పేపర్‌లో ప్రచురించాలని ఆదేశాలు జారీ చేసింది. కాబట్టి మీరు వ్యక్తిగతంగా, లేదా మీ న్యాయవాది ద్వారా **ది. 01-11-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** కోర్టుకు హాజరై మీపై దాఖలైనా దావాలో మీ వివరణ ఇవ్వవలసి ఉంటుంది. మీరు పైన పేర్కొన విచారణ తేదిలో కోర్టుకు హాజరు కావడంలో విఫలమైతే, పై దావాపై మీకు ఆసక్తిలేదని భావించి, విచారణ జరిపి తీర్పు వెలువరిస్తారు.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 26-10-2024 సెల్: 98662 59514